

ఐటీఐలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేటరూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.గోపాలకృష్ణ ఒక ప్రకటలో తెలిపారు. ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 26 మధ్యాహ్నంలోగా దరఖాస్తులు చేసుకోవాలని, 27న మధ్యాహ్నం 3గంటల్లోగా ఏదైనా ప్రభుత్వ ఐటీఐ లేదా సీతంపేట ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఈ నెల 28న సీతంపేట కళాశాలలో జరిగే అడ్మిషన్ కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

కమనీయం.. తెప్పోత్సవం





● పైడిమాంబను కనులారా వీక్షించిన భక్తులు

పైడిమాంబ తెప్పోత్సవం కనులవిందుగా సాగింది. సిరిమానోత్సవాల్లో భాగంగా ఏటా సిరిమాను ఊరేగింపు జరిగిన మరుసటి మంగళవారం తెప్పోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా తెప్పోత్సవం తంతు వైభవంగా జరిగింది. తొలుత పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో వనంగుడి నుంచి ఊరేగింపుగా తెప్పోత్సవం జరిగే ప్రాంతానికి తీసుకొచ్చారు. నిర్దేశించిన సమయానికి అమ్మవారిని విద్యుత్ దీపాలతో అలంకరించిన తెప్పపై ఆశీనులు చేశారు. అనంతరం మూడు పర్యాయాలు పెద్ద చెరువులో పైడిమాంబ విహరించారు. ఆ సమయంలో పెద్ద చెరువు చుట్టూ వున్న భక్తులు జై జై పైడిమాంబ అంటూ నామస్మరణ చేశారు.

6లో

పక్కాగా ధాన్యం కొనుగోలు

- తొలివిడత 2.20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం
- జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- ముందస్తుగానే గోనె సంచుల తరలింపు




గరుగుబిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు పక్కాగా చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యలు చేపడుతోంది. గతంలో ఎదురైన అనుభవాలను దృష్టిలో పెట్టుకుని, రైతులకు అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 183 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతోంది. 3.20 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలివిడతగా 2.20 లక్షల మెట్రిక్ టన్నులను సేకరించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ప్రణాళికలు రూపొందించారు. ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ముగ్గురు చొప్పున సిబ్బందిని నియమించారు. వీరికి తమ విధి విధానాలపై సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. తూనికలతో పాటు తేమ శాతం, ట్రక్ షీట్లు, చెల్లింపులు ఎలా నిర్వహించాలన్న దానిపై అవగాహన కల్పిస్తున్నారు.

కేటగిరీలుగా విభజన

జిల్లాలోని 15 మండలాలను మూడు కేటగిరీలుగా విభజించారు. 183 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు గాను కేటగిరీ-ఏగా 59, కేటగిరీ-బీగా 95, కేటగిరీ-సీగా 29 కేంద్రాలను విభజించారు. గుర్తించిన స్టాక్ పాయింట్లలోనే గోనె సంచులను భద్రపర్చాల్సి ఉంది. ఈ మేరకు ముందస్తుగానే గోనె సంచులు తరలింపునకు చర్యలు చేపడుతున్నారు. రైతులకు అందించేందుకు 21,97,230 సంచులను సిద్ధం చేశారు. సంబంధిత రైస్ మిల్లుల నుంచి రెండు రోజుల్లో ఆయా కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు తరలించే చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆయా కేంద్రాల పరిధిలో గోనె సంచులను సంబంధిత పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్లు, కస్టోడియన్ అధికారులు, ఇన్‌చార్జిలు శుభ్రమైన ప్రాంతాల్లో భద్రపర్చాల్సి ఉంది. మండలాల వారీగా నిర్దేశించిన ధాన్యం కొనుగోలు లక్ష్యాలను చేరుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక.. తహసీల్దార్లకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

కస్టోడియన్ సిబ్బంది నియామకం

జిల్లాలో గుర్తించిన రైస్ మిల్లులకు కస్టోడియన్ అధికారులుగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలను నియమించారు. ఈ మిల్లుల నుంచి పీపీసీ కేంద్రాలకు గోనె సంచులను తరలించాల్సిన బాధ్యత వీరిపై ఉంది. ట్రక్ షీట్లు జనరేట్ చేయకుండా ధాన్యం తరలింపు చేస్తే సంబంధిత కేంద్రంలోని సిబ్బంది కమిషన్ నుంచి బిల్లులు రికవరీ చేస్తారు. గతంలో జిల్లా పౌర సరఫరాలశాఖ నుంచి కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులను తరలించేవారు. అయితే, ఈ ఏడాది మిల్లర్ల నుంచి తరలించేందుకు చర్యలు చేపడుతున్నారు. చిరిగిన గోనెసంచులు ఉంటే చర్యలు తీసుకుంటారు. రైతులకు అధికారులు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలి. రైతుల బ్యాంకు ఖాతాలను కేంద్రాలవారీగా అందించాలి. రైస్ మిల్లర్లు కూడా సహకరించాల్సి ఉంది.



పాలకొండ మండలం వెలగవాడ వద్ద తోటపల్లి ఎడమ ప్రధాన కాలువలో చుక్కనీరు లేని దృశ్యం



చివరిలో కష్టాలు

ఒకపక్క వేసవిని తలపించేలా ఎండలు.. మరోపక్క ముఖం చాటేసిన వరుణుడు.. ఇంకొకపక్క ప్రాజెక్టుల్లో తగ్గిన నీటి సామర్థ్యం. ఫలితంగా వరి పంట చివరి దశలో రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. తోటపల్లి ఎడమ, కుడి పాత ప్రధాన కాలువల ద్వారా శివారు రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. రైతులు శ్రమదానం చేసి కాలువలు బాగు చేస్తున్నా నీరు మాత్రం చేరడం లేదు. దీనివల్ల పంట దిగుబడి తగ్గిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కాలువల ఆధునికీకరణను గత సర్కారు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు.

- తోటపల్లి కాలువల ద్వారా అందని సాగునీరు
- శివారు ప్రాంత రైతుల ఆందోళన
- దిగుబడులపై ప్రభావం చూపుతుందని గగ్గోలు
- పంటలను కాపాడుకునేందుకు తీవ్ర పాట్లు

పాలకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో తోటపల్లి పాత ఎడమ ప్రధాన కాలువ 37 కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉంది. దీని ద్వారా గరుగుబిల్లి, జియ్యమ్మవలస, వీరఘట్టం మండలాల్లో సుమారు 40వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కానీ, ప్రస్తుతం శివారు ప్రాంత్రాల్లోని సుమారు 20 వేల ఎకరాలకు నీరు అందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకటో బ్రాంచి పరిధి వీరఘట్టం మండలంలోని కిమ్మి, గడగమ్మ, తదితర గ్రామాలకు, 7వ బ్రాంచి పరిధి పాలకొండ మండలంలోని అట్టలి, తుమరాడ, బుక్కూరు, తంపటాపల్లి బెజ్జి, పారాపురం తదితర గ్రామాలకు, 8వ బ్రాంచి పరిధిలోని ఓని, గుడివాడ, వెలగవాడ, పీఆర్‌రాజుపేట, సింగన్నవలస, పాలకొండ, వడమ తదితర గ్రామాలకు పూర్తిగా సాగునీరు రావడం లేదు. అదే విధంగా శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలంలోని కొన్ని గ్రామాలకు చుక్క నీరు అందడం లేదు. అలాగే తోటపల్లి పాత కుడి కాలువ బలిజిపేట, వంగర మండలాల్లో విస్తరించి ఉంది. ఈ కాలువ ద్వారా వంగర మండలంలోని శివారు ప్రాంతాలకు సాగునీరు చేరడం లేదు. దీంతో చివరి దశలో ఉన్న వరి పంటను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. చెరువులు, కొండవాగులు, గెడ్డలకు నీటి ఇంజన్లు పెట్టి పంటలకు తడి అందిస్తున్నారు. మరికొంతమంది చేసేది లేక వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, పంట చేతికందుతున్న సమయంలో సాగునీరు అందడం లేదని వాపోతున్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గిపోతాయని ఆవేదన చెందుతున్నారు.



సింగన్నవలస వద్ద ఇంజన్లతో నీటిని తోడుతున్న దృశ్యం

కాలువల ఆధునికీకరణపై నిర్లక్ష్యం..

తోటపల్లి కాలువల ఆధునికీకరణపై గత వైసీపీ ప్రభుత్వం దృష్టిసారించకపోవడంతోనే ఈ దుస్థితి వచ్చిందని రైతాంగం పెదవి విరుస్తుంది. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రూ.200 కోట్లతో పూర్వపు కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది. తరువాత అధికారంలోకి వచ్చిన

- మిగతా 8వ పేజీలో..



వరి కంకుల దశలో ఉన్న పంట

తుఫాన్ గండం

- నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం
- పంటలను కాపాడుకునేందుకు రైతుల తాపత్రయం
- జిల్లా యంత్రాంగం అప్రమత్తం

సాలూరు రూరల్, అక్టోబరు 22: జిల్లాకు తుఫాన్ గండం పొంచి ఉందనే సమాచారంతో రైతుల గుండెల్లో గుబులు రేగుతుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి తుఫాన్‌గా మారనుంది. ఈ తుఫాన్ ఒడిశా రాష్ట్రం పూరీ, సాగర్‌ల మధ్య తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ సమాచారంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను కాపాడుకునే పనిలో బిజీగా మారారు. పత్తి మొదటి విడత దిగుబడి బాగానే వచ్చింది. ఇప్పటికే కొంత పత్తిని సేకరించారు. మిగతా పత్తి పొలాల్లో ఉంది. మొక్కజొన్న పరిస్థితి ఇదే విధంగా ఉంది. వరికి ఇంకా కంకులు వస్తున్న దశలో ఉండడంతో ఆ పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు తక్కువని రైతులు అంటున్నారు. తుఫాన్‌పై ఇప్పటికే కలెక్టర్ మండలస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు.

● తుఫాన్ నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని, పంట సంరక్షణకు చర్యలు చేపట్టాలని సాలూరు మండల వ్యవసాయాధికారి అనురాధ పండా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తుఫాన్‌తో బుధ, గురు, శుక్ర వారాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. పత్తి పొలాల్లో ఉంటే సేకరించి జాగ్రత్త చేసుకోవాలన్నారు. మొక్కజొన్న గింజలు తడవకుండా భద్రపరచుకోవాలని సూచించారు.

ప్రాణ, ఆస్తినష్టం జరగకూడదు: కలెక్టర్

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా జిల్లాలో బుధవారం నుంచి ఈ నెల 25 వరకు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లా, మండల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వర్షాలను బట్టి పాఠశాలలకు సెలవులు ప్రకటించాలన్నారు. శిథిలావస్థలో ఉన్న గృహాల్లో నివసించే వారిని వసతి గృహాలకు తరలించాలన్నారు. కొండవాలు, నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలోజరిగే నష్టాలను పరిశీలించేందుకు ప్రతి మండలంలో చిన్న డ్రోన్లను సిద్ధం చేయాలన్నారు. ఎటువంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం నీటి వినియోగదారుల సంఘాలు, 26న డిస్ట్రిబ్యూటరీ, 28న ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు జరుగుతాయన్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను జాగ్రత్తగా నిర్వహించి జిల్లాలో సజావుగా ఎన్నికలు జరిపించాలని మండల అధికారులను ఆదేశించారు.



సాలూరు మండలం యరగడవలసలో పత్తిని ఎత్తుతున్న రైతులు

విద్యుత్ ఎర్త్‌కు బాలుడి బలి

- ఎలుకలను చంపేందుకు చర్చి చుట్టూ అమర్చిన తీగలు
- ఆడుకుంటూ వెళ్లి తాకిన చిన్నారి ● కూనేరులో విషాదం

కొమరాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఎలుకలను చంపేందుకు పెట్టిన విద్యుత్ ఎర్త్‌కు బాలుడు బలయ్యాడు. ఈ ఘటన కొమరాడ మండలం కూనేరు గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన జిన్నాన గిరి, దివ్య దంపతులకు అనేష్(4) అనే కుమారుడు ఉన్నాడు. వీరి ఇంటి సమీపంలో ఓ చర్చి ఉంది. చర్చిలోకి ఎలుకలు వచ్చి సామగ్రిని పాడు చేస్తున్నాయని కద్రక కృష్ణ అనే వ్యక్తి చర్చి చుట్టూ విద్యుత్ (కంచెను) ఎర్త్ పెట్టాడు. ఈ విషయం తెలియని అనేష్ మంగళవారం సాయంత్రం ఆడుకుంటూ వెళ్లి ఆ వైర్లను తాకడంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బాలుడిని పార్వతీపురం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడు. తమ కళ్లఎదుటే ఆడుతూ పాడుతూ తిరుగుతున్న బాలుడు ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. ఈ సంఘటనపై కొమరాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అనేష్ (ఫైల్)

నిత్యం ఇదే సమస్య!

- అంతర్రాష్ట్ర రహదారిపై గోతిలో దిగబడిన లారీ
- నిలిచిన ట్రాఫిక్

6లో



చదివించాలనే ఆశయంతో..

6లో

- సంచార గ్రంథాలయంతో పర్యటన
- పుస్తక పఠనంపై మక్కువ పెంచుతున్న రమణ

పైడిమాంబ తెప్పోత్సవం


పెద్దచెరువులో పైడిమాంబ తెప్పోత్సవం

పడవపై అర్చకులు, అధికారులు, పోలీసులు



అమ్మవారిని తీసుకువెళ్తున్న భక్తులు


తెప్పోత్సవానికి అమ్మవారిని తీసుకొస్తున్న దృశ్యం

- పెద్ద చెరువులో అమ్మవారి విహారం
- పులకించిన భక్త జనం

విజయనగరం రూరల్, అక్టోబరు 22: (ఆంధ్రజ్యోతి): మేళతాళాలు.. వేద పండితుల మంత్రోచ్ఛరణలు.. భక్తుల జై పైడిమాంబ నామస్మరణ మధ్య మంగళవారం సాయంత్రం అమ్మవారి తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏటా సిరిమానోత్సవం జరిగిన మరుసటి మంగళవారం తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తూ.. ఆలయ అధికారులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. నగర పాలక సంస్థ, రెవెన్యూ, మత్స్య, ఆర్ అండ్ బీ, పోలీసు తదితర ప్రభుత్వ శాఖలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్య మయ్యాయి. రైల్వే స్టేషన్ వద్ద ఉన్న వనంగుడిలో పైడిమాంబకు పుష్పాలంకరణ చేశారు. తొలుత వనంగుడి వద్ద వేద సభను నిర్వహించారు. అనంతరం భక్తులకు పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆ తరువాత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఉంచారు. రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి తెప్పోత్సవం జరిగే ప్రాంతం వరకూ ఊరేగింపు నిర్వహించారు. పైడితల్లి మాలధారణ చేసిన భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు బంటుపల్లి వెంకటరావు, ఈఓ డీవీ ప్రసాదరావు, సూపరింటెండెంట్ ఏడు కొండలు ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంక రించిన తెప్పపై నిర్ణీత సమయానికి పైడిమాంబ ఉత్సవ విగ్రహాన్ని ఉంచారు. మూడు పర్యాయాలు పెద్ద చెరువులో పైడిమాంబ విహరించారు. ఆ సమయంలో పెద్ద చెరువు చుట్టూ ఉన్న భక్తులు జై జై పైడిమాంబ అంటూ అమ్మవారి ని స్మరించారు. తెప్పోత్సవాన్ని వీక్షించేందుకు వచ్చిన భక్తులకు నగరం లోని వివిధ స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా ప్రసాదం, మంచినీరు అందించాయి. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం 6.30 గంటలకు ముగిసింది. పెద్దచెరువు చుట్టూ... తెప్పోత్సవం జరిగే ప్రాంతంలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. ఎవరినీ పెద్దచెరువు లోకి దిగనీయకుండా... బారికేడ్ల వద్ద నుంచే తెప్పోత్సవాన్ని వీక్షించే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు భక్తులకు తాగునీటి సదుపాయాన్ని కల్పించింది.

తుఫాన్ ముప్పు



- జిల్లాలో నేటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- పంటలను కాపాడుకునే పనిలో రైతులు

విజయనగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు తుఫాన్ ముప్పు పొంచి ఉందనే సమాచారంతో రైతుల గుండెల్లో గుబులు రేగుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం వాయుగుండంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి తుఫాన్‌గా మారనుంది. అనంతరం ఒడిశా రాష్ట్రం పూరీ, సాగర్‌ల మధ్య తీరం దాటే అవకాశాలు ఉన్నాయి. ఆ సమయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ సమాచారంతో రైతులు టెన్షన్ పడుతున్నారు. పంటలను కాపాడుకునే యాతనలో ఉన్నారు. వరి పంట కంకులు వచ్చిన దశలో ఉండడంతో నష్టం వాటిల్లే అవకాశాలు తక్కువని రైతులంటున్నారు. తుఫాన్‌పై ఇప్పటికే కలెక్టర్ మండలస్థాయి అధికారులను అప్రమత్తం చేశారు. వాయుగుండం వాయువ్య దిశగా కదులుతూ ఈనెల 24వ తేదీకి తీవ్ర తుఫాన్‌గా మారే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ భావిస్తోంది. 24వ తేదీ రాత్రి లేదా 25 ఉదయానికల్లా పూరీ, సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉంది. ఆ సమయంలో గంటకు 100 నుంచి 110కి.మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయొచ్చునంటున్నారు. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులంతా తీరానికి సకాలంలో చేరుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని అన్ని పోర్టులలో ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధికారయంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముఖ్యంగా తీరప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులంతా నిమగ్నంకావాలని కలెక్టర్ ఆదేశించారు.

ప్రత్యేకాధికారి సమీక్ష

పూసపాటిరేగ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌పై ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జోషఫ్ మండల అధికారులను అప్రమత్తం చేశారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని, మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లనీయవద్దని, తీరప్రాంతాల్లో ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, పెద్దపెద్ద చెట్లు, పాత ఇళ్లను గుర్తించాలన్నారు. ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లో ప్రత్యేక సెల్‌లు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

మాస్టార్లు స్పందించరు ఎందుకో!

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కుకు స్పందన కరువు
- ఇప్పటి వరకూ 132 మంది మాత్రమే దరఖాస్తు
- వచ్చే నెల 6 వరకు గడువు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 22 (విజయనగరం): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు జిల్లాలో స్పందన కరువైంది. ఓటు నమోదుకు నోటిఫికేషన్ ఇచ్చి నెల రోజులు దాటింది. ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా 132 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఆఫ్‌లైన్‌లో 91 మంది, ఆన్‌లైన్‌లో 41 మంది దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన ఉపాధ్యాయులు నవంబరు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువు ప్రకారం ఇంకా 15 రోజులు మాత్రమే ఉంది. 8వ తరగతి నుంచి పీజీ వరకూ బోధించే ఉపాధ్యాయులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటికే కలెక్టర్, డీఆర్‌వోలు సంబంధిత అధికారులతో సమీక్షించి.. అర్హులైన ఉపాధ్యాయులతో ఓటు హక్కు నమోదు చేయించాలని సూచించారు. దీనిపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. 2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదుకు అప్పట్లో జిల్లా వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో 455 మంది, ఆఫ్‌లైన్‌లో 13,226 మంది, మొత్తం 13,681 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 11,536 దరఖాస్తులను తిరస్కరించారు. జిల్లా వ్యాప్తంగా 2,145 దరఖాస్తుల ను ఆమోదించారు. ఈసారి ఆ స్థాయిలో స్పందన కనిపించడం లేదు.

ఇదీ క్రమం..

అర్హులైన ఉపాధ్యాయులు నవంబరు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అదే నెల 23న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరిస్తారు. అనంతరం డిసెంబరు 30న ఓటర్ల తుది జాబితాను ప్రచురిస్తారు. జిల్లాలో జెడ్పీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి. గడువు ముగిసేలోగా ఎంతమంది దరఖాస్తు చేసుకుంటారో చూడాలి.



నిత్యం ఇదే సమస్య!

- గోతిలో దిగబడిన లారీ
- నిలిచిన ట్రాఫిక్

కొమరాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): అంతర్ రాష్ట్ర రహదారిపై నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభించేది ఎప్పుడోనని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు గ్రామం కూనేరు వద్ద అంతర్ రాష్ట్ర రహదారిపై ఏర్పడిన గోతిలో మంగళవారం ఉదయం ఓ భారీ లారీ దిగబడిపోయింది. సుమారు 6 గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. కూనేరు నుంచి గాంధీనగరం వరకు లారీలు బారులుదీరాయి. ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు నిత్యం ఈ రహదారిపై లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత వారం రోజులుగా ఈ రహదారిపై ఏర్పడిన గోతుల్లో ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి యుద్ధప్రాతిపదికన కనీసం గోతులనైనా పూడ్చి పెట్టాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు.


బురదలో దిగబడిన లారీ


రోడ్డుపై బారులు తీరిన లారీలు

చదివించాలనే ఆశయంతో

- సంచార గ్రంథాలయంతో పర్యటన
- పుస్తక పఠనంపై మక్కువ పెంచుతున్న రమణ



మోటార్ సైకిల్‌పై పుస్తకాలను తీసుకొని వెళ్తున్న రమణ

చీపురుపల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి)

'చదువు విజ్ఞానాన్నిస్తుంది. చదువు సంస్కారాన్ని పెంచుతుంది. చదువు జీవితానికి సార్థకతను చేకూరుస్తుంది. అందుకే అందరూ చదవాలి. చదువుకున్న ప్రతి ఒక్కరూ మరెందరి చేతనో చదివించాలి.'... ఇదే ఆయన ఆశయం. ఆ ఆశయమే 'ఆశయ' సంస్థ ఆవిర్భావానికి నాంది పలికింది. చీపురుపల్లి పట్టణంలోని జి.అగ్రహారానికి చెందిన రెడ్డి రమణ.. ఆశయ అనే స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి, సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. వాటిలో ఒకటి మొబైల్ బైక్ లైబ్రరీ. ఈ మొబైల్ బైక్ లైబ్రరీ లక్ష్యమేంటంటే.. మొదటిది పఠనం పట్ల అవగాహన కల్పించడం. రెండోది.. చదవాలనుకున్న వారికి పుస్తకాలను అందుబాటులోకి తేవడం. 2020 అక్టోబరులో ఆయన ఈ మొబైల్ బైక్ లైబ్రరీని ప్రారంభించారు. తన బైక్‌కు పుస్తకాలను తగిలించుకొని ఆయన ఎంత దూరమైనా ప్రయాణం చేస్తారు. ముఖ్యంగా లైబ్రరీ సదుపాయాలు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాలకు రమణ తన బైక్‌తో వెళ్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, గ్రామాల్లోని పది మంది కూర్చునే రచ్చ బండలు, ప్రధాన రహదారులపైన వాహనదారులు, యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకొని తన ప్రయాణాన్ని సాగిస్తున్నారు. వారికి పుస్తకాలను అందజేసి.. ఆయనే దగ్గరుండి చదివిస్తున్నారు. పుస్తకంలో కొంత భాగమైనా చదివినంత వరకూ అక్కడే ఉంటున్నారు. పుస్తక పఠనంపై ఏమాత్రం ఆసక్తి లేకపోయినా... పదే పదే వారికి అవగాహన కల్పిస్తున్నారు. నాలుగేళ్ల కిందట ప్రారంభించిన ఈ మొబైల్ బైక్ లైబ్రరీ ద్వారా ఇప్పటి వరకూ నాలుగు మండలాల్లోని 1650 కి.మీ. తిరిగానని.. పుస్తక పఠనంపై 28,050 మందికి అవగాహన కల్పించానని రమణ తెలిపారు. దాతల సాయంతో సుమారు మూడు లక్షలకు పైగా పుస్తకాలను వివిధ వర్గాల వారికి అందజేశామన్నారు.


విద్యార్థులు, యువతతో పుస్తకాలను చదివిస్తున్న దృశ్యం

ప్రమాదంలో గాయాలు..

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆశయ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి రమణ తీవ్రంగా గాయపడ్డారు. గరివిడి మండలంలోని అప్పన్నవలస జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రమణ తలకు బలమైన గాయాలయ్యాయి. ఆయన ఆరోగ్య పరిస్థితిపై జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఆరా తీశారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో రమణకు చికిత్స అందిస్తున్న వైద్యులతో శ్రీనివాసరావు మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు డా. రామారావు, డా. ప్రసాద్‌లను కోరారు.


బావిలో జలాసనంలో సంతోష్

నీటిలో తేలినట్టుందే!

- జలాసనంలో దిట్ట సంతోష్
- అంగవైకల్యాన్ని ఓడించిన ఆసక్తి
- ఏకబిగిన 4 గంటలు నీటిలోనే..
- అబ్బురపరుస్తున్న యువకుడి ప్రావీణ్యం

గుర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): 'సాధన చేయుమురా నరుడా సాధ్యము కానిది లేదురా' అన్న సినీ గీత రచయిత మాటలను ఆచరణలో చూపిస్తున్నాడా యువకుడు. ఎవరి వద్ద ఎటువంటి శిక్షణ పొందకుండానే స్వీయ సాధనతో జలాసనంతో అబ్బుర పరుస్తున్నాడు. నీటిలో వెల్లకిలా 4 గంటల పాటు తేలియాడుతూ ఔరా అనిపిస్తున్నాడు. అతనే విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామానికి చెందిన శనపతి సంతోష్. పుట్టుకతో వికలాంగుడైన సంతోష్‌కు చిన్నప్పటి నుంచి ఈత అంటే మహా సరదా. ఊర్లో చెరువులు, బావుల్లో స్నేహితులతో కలిసి గంటల కొద్దీ ఈత కొట్టేవాడు. క్రమంగా జలాసనం గురించి తెలుసుకున్న సంతోష్ దానిపై ఆసక్తి పెంచుకున్నాడు. పాటించాల్సిన మెలకువలపై కూడా ఎవరినీ సంప్రదించకుండా తనకు తానుగా బావుల్లో జలాసనం వేయడం మొదలు పెట్టాడు. 5 నిమిషాలతో మొదలైన జలాసనం ఇప్పుడు ఏకబికిన 4 గంటల పాటు కొనసాగించే స్థాయికి చేరిందంటే ఆశ్చర్యపోవాల్సిందే. ఇంతటి పట్టు ఎలా సాధ్యమైందని అడిగితే చిరునవ్వే సమాధానమవుతుంది. జలాసనానికి ముందుగా కొన్ని నిమిషాల పాటు ఈతకొట్టి... ఆ తర్వాత ఊపిరి బిగబట్టి నీటిలో వెల్లకిలా తేలియాడుతాడు. జలాసనానికి ఉపక్రమించాక తిరిగి విరమించే వరకు అలాగే ఉంటాడు. ఏ ఒక్క అవయవంలోనూ చలనం కనిపించదు. ఆ స్థితిలో చూసే వారు మృత దేహంగా భావించి భయపడిన సందర్భాలు ఎన్నో. అంతెందుకు.. ఆయన కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందిన సందర్భాలు ఉన్నాయి. రహదారి అంచున ఉన్న బావిలో సంతోష్ జలాసనంలో ఉన్న సమయంలో అటువైపు రాకపోకలు సాగించేవారు బావిలో మృతదేహం ఉందంటూ కేకలు పెట్టిన సందర్భాలు కూడా లేకపోలేదు. అసలు విషయం తెలిశాక ఆశ్చర్యపోవడం వారి వంతు. ఈ కళను హాబీగా చేసుకున్న సంతోష్ చూపరుల కోరిక మేరకు తరచూ ప్రదర్శిస్తూనే ఉంటాడు. ఇప్పటికే సామాజిక మాధ్యమాల ద్వారా గుర్తింపు పొందిన సంతోష్ నాలుగు గంటల తన రికార్డును తిరగ రాసేందుకు సిద్ధమవుతున్నాడు. శిక్షణతో జలాసనంలో ప్రావీణ్యం సంపాదించిన వారందరికీ తాను ఏకలవ్య శిష్యుడినని చెబుతాడు సంతోష్.



తాగునీటి కలుషితంపై ఆరా

- గుర్లలో పర్యటించిన ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్
- డయేరియా వ్యాప్తిపై సమగ్ర విచారణ

గుర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): డయేరియా వ్యాధి ప్రబలడానికి గల కారణాలను తెలుసుకునేందుకు ప్రభుత్వం నియమించిన సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే.విజయానంద్, జిల్లా కలెక్టర్ బీఆర్.అంబేడ్కర్‌తో కలిసి మంగళవారం గుర్ల గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని, తాగునీటి పైపు లైన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. తాగునీటి కలుషితంపై ఆరా తీశారు. నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాన్ని డీపీవో వెంకటేశ్వరరావు వివరించారు. అంతకుముందు నెలిమర్ల మండలం ఎస్ఎస్ఆర్.పేట తాగునీటి పథకాన్ని ఆయన సందర్శించారు. గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. డయేరియాకు చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యంపై ఆరా తీశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, ఇతర వైద్యులతో మాట్లాడారు. ఏపీ ఈపీడీఎస్ సీఎండీ పృథ్వీతేజ, జేసీ సేతుమాధవన్, ఆర్డీవో బి.సత్యవాణి, తహసీల్దార్ ఆదిలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం జిల్లాకు వచ్చారు. ముందుగా కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ అంబేడ్కర్, జేసీ సేతుమాధవన్‌తో పాటు పలు శాఖల అధికారులతో మాట్లాడారు. తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలు, ఆయా గ్రామంలోని పారిశుధ్యం పరిస్థితులు, డయేరియా బాధితులకు అందించిన వైద్య సహాయం తదితర అంశాలపై


పీహెచ్‌సీ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, స్పెషలాఫీసర్

సమగ్రంగా సమాచారం సేకరించారు. గ్రామంలోని తాగునీరు కలుషితం కావడానికి గల కారణాలపై కూడా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆరా తీశారు. తాగునీరు పరీక్షలు అనంతరం వచ్చిన ల్యాబ్ రిపోర్టుల ఫలితాలుపై ఆరా తీశారు. గ్రామంలోని బహిరంగ మలవిసర్జన జరుగుతున్నట్లు తెలిసిందని, గ్రామంలోని వ్యక్తిగత మరుగుదొడ్లు లేనికుటుంబాలు ఎన్ని ఉన్నాయనే అనేదానిపై అడిగి తెలుసుకున్నారు. వాటి వివరాలను డీపీవో వెంకటేశ్వరరావు వివరించారు.

80వేల సభ్యత్వాలే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 80వేల సభ్యత్వాలు చేసే విధంగా పార్టీ నేతలు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పిలుపునిచ్చారు. మంగళవారం ఎల్.కోటలోని ఆమె స్వగ్రహంలో 5 మండలాల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, భూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, నియోజకవర్గ నేతలతో సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా తెలుగుదేశం పార్టీకి ఉన్న కార్యకర్తల బలం మరే పార్టీకి లేదన్నారు. ఎస్.కోట నియోజకవర్గం నుంచి 80వేల సభ్యత్వాలు నమోదుచేసి పార్టీ కేడర్‌ను బలోపేతం చేయాలని నేతలకు సూచించారు. పెద్ద పంచాయతీల్లో కార్యకర్తలు, నేతలు భారీ మొత్తంలో సభ్యత్వాలు నమోదు చేయాలని ఆదేశించారు. కార్యకర్తల సంక్షేమం, వారి అభివృద్ధి ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని , కార్యకర్తలకు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ నెల 26 నుంచి పార్టీ సభ్యత్వం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా, బాధ్యతగా పనిచేసి త్వరగా సభ్యత్వ నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకూరి సుధారాణి, చొక్కాకుల మల్లునాయుడు, గొరపల్లి రాము, కరెడ్ల ఈశ్వరరావు, గొంప వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలు నెరవేరుస్తాం


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కోండ్రు మురళి

రాజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు పెట్టుకున్న ఆశలన్నింటినీ కూటమి ప్రభుత్వం క్రమంగా తీరుస్తుందని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి అన్నారు. మండలం శ్యాంపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రాజాం మెయిన్ రోడ్డు నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలని దిశానిర్దేశం చేశారు. అనంతరం మెయిన్ రోడ్డులో నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ఇప్పటికే రాజాం ప్రధాన రహదారి పనులు శరవేగంగా చేపడుతున్నట్టు తెలిపారు. పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయని, నియోజకవర్గంలో అన్ని మండలాల్లోనూ సుమారు రూ.50 కోట్లతో రోడ్లు, కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, గురవాన నారాయణరావు, టంకాల కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధైర్య సాహసాలు అవసరం

● కమాండెంట్ మల్లికా గార్గ్


విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లికా గార్గ్

డెంకాడ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సమాజంలో ధైర్య సాహసాలతో ముందుకు దూసుకుపోవాలని చింతలవలస 5వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం చింతలవలస వద్ద గల 5వ పోలీస్ బెటాలియన్ ఆవరణలో మంగళవారం ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా ఆయుధాల గురించి, సమాచారం గురించి, ఎస్‌డీఆర్ఎఫ్ గురించి విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా దేశ రక్షణ, శాంతి భద్రతలపై క్విజ్ పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. బెటాలియర్ ఎడిషనల్ కమాండెంట్ సత్తిబాబు, ఇంచార్జి ఎడిషినల్ కమాండెంట్ ప్రభాకరరావు, అసిస్టెంట్ కమాండెంట్ బాపూజీ, సిబ్బంది, పలు పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య సమస్య రాకుండా చూస్తాం

● చిన్నయ్యపేటకు కదిలివెళ్లిన షుగర్స్ ప్రతినిధులు


గ్రామస్థుల సమస్యలు తెలుసుకుంటున్న షుగర్స్ ఏవీపీ

రేగిడి, అక్టోబరు 22, (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నయ్యపేటకు కాలుష్య కారక సమస్యలు లేకుండా చూస్తామని, గ్రామానికి కావాల్సిన సంక్షేమ చర్యలకు వెనకాడమని సంకిలి ఇఐడీ ప్యారీ అసోషియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ముందురోజు చిన్నయ్యపేటవాసులు షుగర్స్‌మెయిన్ గేట్ వద్ద గ్రామ సమస్యలపై నిరసన వ్యక్తంచేయగా, దీనికి స్పందించిన యాజమాన్యం వారి ప్రతినిధులుగా అసోషియేట్ వైస్ ప్రెసిడెంట్(ఏవీపీ) పట్టాభిరామిరెడ్డి, కేన్ మేనేజర్ కమల్, సిబ్బందితో గ్రామానికి కదిలివెళ్లారు. యాజమాన్యప్రతినిధులు గ్రామంలో కలియుతిరిగి వారి సమస్యలు తెలుసుకొన్నారు. ఇకపై కాలుష్యపూరిత సమస్యలు లేకుండా చూస్తామన్నారు. షుగర్స్ సిబ్బంది, చిన్నయ్యపేట గ్రామపెద్దలు ఉన్నారు.

ఆడిటోరియానికి గడియారాల వితరణ


ఆడిటోరియం ప్రతినిధులకు గడియారాలను అందజేస్తున్న దృశ్యం

బొబ్బిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోగల శ్రీకళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసేందుకు రెండు మెగా గడియారాలను మంగళవారం రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీరాజు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా కళాభారతి ప్రధాన కార్యదర్శి నంబియార్ వేణుగోపాలరావు, కార్యదర్శి పుల్లెల శ్రీనివాసరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను చేపట్టడంలో జేసీ రాజు ముందుంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక రోటరీక్లబ్ చైర్మన్ శ్రీనివాసన్, శ్రీహరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా సోషల్ ఆడిట్ గ్రామసభ


జామి గ్రామసభలో గొడవపడుతున్న దృశ్యం

జామి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలో మంగళవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ గ్రామసభ రసాభాసగా మారింది. ఏపీవో కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసభలో పలువురు యువకులు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో చాలావరకు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. గ్రామానికి చెందిన ఈశ్వరరావు అనే యువకుడు గ్రామసభలో మాట్లాడుతూ మండలకేంద్రం అప్పన్నపాలానికి చెందిన శిరికి రవికుమార్ సింగపూర్‌లో ఉంటే ఇక్కడ మస్తర్లు వేశారని, వలంటీరుగా పనిచేసిన మిడతాన శ్రీను మూడురోజులు మాత్రమే ఉపాధి పనుల్లో పాల్గొనాలనే నిబంధన ఉన్నప్పటికీ సదరు వ్యక్తి వారంలో ఆరురోజులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేసినట్లు మస్తర్లువేశారని, గ్రామంలో సైకిల్‌షాప్, బెల్ట్ షాప్ పెట్టుకున్న వ్యక్తి ఉపాధి పనికి రాకపోయిన మస్తర్లు వేశారని, సుంకరి ఎర్నాయుడు చెరువు పనికి రాకపోయినా వచ్చినట్లు చూపి ఏడువారాలకు ఏడు వేలు రూపాయలు పొందాడని, దేరాల పద్మానాభం అనే టైలర్ విషయంలోనూ ఇలానే చేశారని, ఇలా బోలెడు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తాము ఈవిషయాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదుచేస్తామని తెలిపారు. ఇక్కడ ఆడిట్ సభ నిర్వహిస్తున్న ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ అక్రమాలకు అండగా ఉన్నారని ఆరోపించారు. పనికి రానివారికి మస్తర్లు వేసి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, ఇక్కడ లేని వ్యక్తులకు మస్తర్లు వేసి వారిపేరు మీద డబ్బులు పెద్ద ఎత్తున స్వాహా చేశారని ఆరోపించారు. ఈవిషయాలపై ఏపీవో కిరణ్మయి వివరణ కోరగా అంతా గందరగోళంగా మారిందని, తనకు ఏమీ వినిపించలేదని ఎస్ఆర్‌పీ, డీఆర్‌పీ ఇచ్చే నివేదిక చూశాక వీటిపై విచారణ చేస్తామన్నారు.

ప్రభుత్వ కళాశాల వద్ద దుకాణాలు తొలగింపు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద అక్రమంగా ఏర్పాటుచేసి నిర్వహణ లేకుండా వదిలేసిన దుకాణాలను తహసీల్దార్ అరుణకుమారి, పంచాయతీ ఈవో అనురాధ, ఈవోపీఆర్డీ లక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది మంగళవారం సాయంత్రం తొలగించారు. తహసీల్దార్ మట్లాడుతూ అక్రమ దుకాణాలను క్రమక్రమంగా తొలగిస్తామని పేర్కొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం


శంకుస్థాపన చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

మెరకముడిదాం (గరివిడి), అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్ని గ్రామాలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు అన్నారు. మెరకముడిదాం మండలం భీమవరంలో మంగళవారం సాయంత్రం పల్లె పండుగ కార్యక్రమంలో హాజరై పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాలను తలపించే విధంగా గ్రామాలను అభివృద్ధి చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయలేదని విమర్శించారు. విశాఖపట్నంలో తమ నాయకులు మంత్రి నారాలోకేష్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు తెస్తున్నారని, దీనివలన ఉత్తరాంధ్ర యువకులకు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.

భూముల నష్టపరిహారంలో అన్యాయం చేశారు

- ఆర్డీవో ముందు గ్రీన్ ఫీల్డ్ నిర్వాసిత రైతుల ఆవేదన

కొత్తవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్‌హైవే కోసం తీసుకున్న భూములకు సంబంధించి నష్టపరిహారం విషయంలో తమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండలంలోని ఉత్తరాపల్లి గ్రామానికి చెందిన రైతులు విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి వద్దతమ గోడు వెళ్లబోసుకున్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వం ఇచ్చిన నష్టపరిహారాన్ని తీసుకోలేని రైతులతో ఆర్డీవో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. తమ గ్రామంలో హైవే కోసం తీసుకున్న వ్యవసాయ భూములకు శెంటుకు 35 వేల రూపాయాలను అవే భూములను వ్యవసాయేతర భూములుగా మార్చుకుంటే శెంటుకు మూడు లక్షల రూపాయలను ఇవ్వడం జరిగిందన్నారు. ఇదెక్కడి న్యాయమంటూ ఆర్డీఓను కోరారు. ప్రభుత్వం తీసుకున్న తమ వ్యవసాయ భూములకు కనీసం శెంటుకు 75 వేల రూపాయలు నైనా ఇవ్వాలని కోరారు. తమ గ్రామం తరువాత చిన్నిపాలెం గ్రామానికి చెందిన భూములకు శెంటుకు 45 వేల రూపాయలు ఇచ్చారని తమకెందు ఇంత అన్యాయం చేశారన్నారు. భూములు సేకరణ చేసినప్పుడు నష్ట పరిహారం మంజూరులో 2011 భూసేకరణ చట్టం కింద నష్ట పరిహారం ఇవ్వాలని ప్రభుత్వమే చట్టం చేసి తమకు నష్టపరిహారం మంజూరు చేసే విషయంలో 1956 చట్టం అమలు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. తమకు అన్ని విధాల నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని తీసుకుని జిల్లా కలెక్టర్ వద్ద మధ్యవర్తిత్వం కోసం అప్పీలు చేసుకోవాలని ఆర్డీవో కీర్తి తెలిపారు. అప్పుడు ఫైల్ మళ్లీ తన వద్దకు వస్తుందని, రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. రైతులు ప్రభుత్వం ప్రకటించిన నష్ట పరిహారం తీసుకోకపోతే నిబంధనల ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.నీలకంఠారావుతో పాటు భూములు కోల్పోయిన 30 మంది రైతులు హాజరయ్యారు.

న్యూస్ బాక్స్

28న ప్రభుత్వ ఐటీఐలో కౌన్సిలింగ్

బొబ్బిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 28న కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఐటీఐ కోర్సులు చదవాలని ఆసక్తి కలిగిన విద్యార్థులంతా ఈ నెల 26లోగా రిజిస్ట్రేషన్ చేయించుకుని యూనిక్ నెంబరు పొందాలని సూచించారు. విద్యార్థులు విజయనగరం, బొబ్బిలి, రాజాం ఐటీఐలలో ఎక్కడైనా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లను ఈ నెల 27లోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. 28న ఉదయం 8 గంటలకు బొబ్బిలి ఐటీఐలో హాజరుకావాలన్నారు.

భూసమస్యలు పరిష్కరిస్తాం

గుర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): భూ రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఉప తహసీల్దార్ నారాయణమ్మ తెలిపారు. మంగళవారం గుజ్జంగివలస, మీసాలపేట గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు.

పైపులైన్‌కు మరమ్మతు పనులు

బొబ్బిలి, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): స్థానిక రాణిమల్లమ్మదేవి మున్సిపల్ పార్కు సమీపంలో బొబ్బిలి-బలిజిపేట ప్రధాన రహదారి మధ్యలో మున్సిపల్ కుళాయి పైపులైనుకు మరమ్మతు పనులు చేపట్టారు. ఈ పైపులైనుకు లీకేజీ సమస్య తీవ్రంగా ఉండడంతో గుర్తించిన మున్సిపల్ అధికారులు మంగళవారం బాగుచేయించారు.

జనసేన పట్టణ అధ్యక్షుడిగా మోపాడ చిన్ని

శృంగవరపుకోట రూరల్: జనసేన ఎస్.కోట టౌన్‌పార్టీ అధ్యక్షుడిగా మోపాడ చిన్ని నియమితులయ్యారు. ఈ విషయాన్ని మంగళవారం జనసేన నియోజకవర్గ నాయకుడు ఒబ్బిన సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎలమంచిలి దేముడును నియమించారు. ● మండలంలోని గిరిశిఖర పంచాయతీ ధారపర్తికి క్షేత్రసహాయకుడిని నియమించాలని కలెక్టర్, ఇతర అధికారులను కోరినట్లు జనసేన నియోజకవర్గ నేత ఒబ్బిన సన్యాసి నాయుడు ప్రకటనలో తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

నెల్లిమర్ల, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందించాలని ఎంపీడీవో రామకృష్ణరాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈవోపీఆర్డీ శంకర్ జగన్నాథం, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

విజయనగరం టౌన్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గుర్ల గ్రామంలో డయేరియా వ్యాధి బారినపడి ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యంతోనే జిల్లాలో డయేరియా విజృంభిస్తోందన్నారు. జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

వెంకట శ్రీరామ్‌కు అభినందన

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో రాష్ట్రస్థాయి స్కూల్ అసిస్టెంట్ గణితం సబ్జెక్టులో జిల్లాకు చెందిన మహారాజా విద్యాకళాశాల బీఈడీ పూర్వ విద్యార్థి కొల్లూరి వెంకట నాగ శ్రీరామ్ తొలి ర్యాంకు సాధించి ఖమ్మంలో ఉపాధ్యాయుడిగా నియమితులైన సందర్భంగా మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టరు కేవీఎల్ రాజు ఆయనను అభినందించారు. మంగళవారం మహారాజా అటానమస్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో శ్రీరామ్‌ని అభినందించారు. స్ఫూర్తి ప్రదాత విజయనగరం మహారాజా అనే పుస్తకాన్ని శ్రీరామ్‌కి అందజేశారు.

16, 17 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలు నవంబరు 16, 17 తేదీల్లో జరగనున్నాయని, ఈ సభల్లో సీపీఎం నాయకులు, కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లాశాఖ కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ చెప్పారు. మంగళవారం స్థానిక ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ముందుగా మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, టీవీ రమణ, వి.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రాజాం ప్రతిష్ఠను ఇనుమడింపజేశారు

రాజాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): రాజాం ప్రతిష్ఠను ఇనుమడింప జేయడం అభినందనీయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పెంకి గౌరీశ్వరరావుకు ప్రకృతి పురస్కార అవార్డు రావడం, ఆ అవార్డును ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా అందుకోవడం అభినందనీయమన్నారు. టీడీపీ నాయకులు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, గురవాన నారాయణరావు దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులున్నారు.

గంజాయితో పట్టుబడిన యువకుడు

పూసపాటిరేగ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలో కందివలసగెడ్డ వద్ద దేశెట్టి భానుజీ 12 వందల గ్రాముల గంజాయితో సోమవారం పోలీసులకు పట్టుపడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పూర్తి సమాచారం రాబట్టేందుకు యువకుడిని విచారిస్తున్నామన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కారకులైన వారి వివరాలను సేకరిస్తున్నామని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

చింతపల్లి తీరంలో గుర్తుతెలియని మృతదేహం

పూసపాటిరేగ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చింతపల్లి సముద్రతీరానికి ఒక గుర్తుతెలియని మృతదేహం కొట్టుకొని వచ్చింది. గుర్తించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ దుర్గాప్రసాద్, పోలీసు సిబ్బందితో ఆ ప్రదేశానికి వెళ్లారు. మృతదేహం ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ మృతదేహాన్ని గుర్తించామని, దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

సంతకవిటి: మండలంలోని మామిడిపల్లిలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త సాకేటి లక్ష్మీనారాయణ(37) గుండెపోటుతో సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందాడు. అతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉదయం అస్వస్థతకు గురైన లక్ష్మీనారాయణను కుటుంబ సభ్యులు కారులో హైదరాబాద్ లో ప్రైవేట్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ అతనిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దాంతో మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మామిడిపల్లిలోని ఇంటికి తీసుకువచ్చారు. మామిడిపల్లిలో తూర్పుకాపు మాజీ చైర్మెన్ కొల్ల అప్పలనాయుడు పూలమాల వేసి నివాళర్పించారు. నియోజకవర్గం లోని పలువురు వ్యక్తులు మృతిని కుటుంబాన్ని పరామర్శించి వారికి సంతాపం తెలిపారు.

అనుమానాస్పద రీతిలో వ్యక్తి మృతి

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరమణపేట గ్రామం వద్ద మంగళవారం మధ్యాహ్నం విశాఖ వైపు వెళ్లే రహదారిలో ఒక వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఈ విషయంపై స్థానికులు మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన మురుగన్(48) ఎస్‌కోటలో నివాసం ఉంటున్నాడని, ఇతను తమ గ్రామం వద్ద ఫిట్స్‌తో పడిపోయాడని, గమనించిన వెంటనే అతని చేతిలో తాళాలు పెట్టినప్పటికీ తుది శ్వాస విడిచాడని తెలిపారు. దీనిపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డ్రోన్ షోను తిలకించిన మంత్రి, ఎమ్మెల్యే


డ్రోన్ షోలో సీఎం చంద్రబాబుతో ఎమ్మెల్యే అదితి, మంత్రి కొండపల్లి

విజయనగరం అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పున్నమి ఘాట్‌లో మంగళవారం రాత్రి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన డ్రోన్ షో కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసి ఈ షోను తిలకించి ప్రత్యేకానుభూతిని పొందారు. ప్రపంచ స్థాయి డ్రోన్ హబ్‌గా అమరావతిని తీర్చిదిద్దాలన్న చంద్రబాబు సంకల్పం విజయవంతమై సత్ఫలితాలు సాధించడం ఖాయమని ఎమ్మెల్యే అదితి అన్నారు. అద్భుతమైన దూరదృష్టి కలిగిన బాబు నాయకత్వంలో రాష్ట్రం చరిత్రలో నిలిచిపోయే విధంగా అభివృద్ధి చెందుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న పాలూరు బాబు

బొబ్బిలి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీబీఎం బాలికల ఉన్నత పాఠశాల అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని రాష్ట్ర జనసేన పార్టీ కార్యక్రమాల అమలు కార్యదర్శి పాలూరు బాబు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన తమ నాయకులతో కలిసి ఆర్డీవో జేవీఎస్ఎస్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ స్థానిక వైసీపీ నాయకులు చీపురుపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూ బదలాయింపు పేరుతో స్కూలును రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఇందుకు బాధ్యులైన వారందరిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టరుకు, డీఈవోకు తెలియకుండానే ఈ తంతు పూర్తి చేశారన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సంచాన గంగాధర్, జనసైనికులు జిల్లెళ్ల లక్ష్మణరావు, రేవళ్ల కిరణ్‌కుమార్, అల్లు రమేష్, దిబ్బ కల్యాణ్, ఫైల సాయిరాం, పిళ్లా సతీష్, గైనేడి రమ్య పాల్గొన్నారు.

దాసుపేటలో నలుగురికి డయేరియా లక్షణాలు

దత్తిరాజేరు, అక్టోబర్ 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాసుపేట గ్రామానికి చెందిన రేవళ్ల నారాయణప్పడు, కన్నాం గ్రామానికి చెందిన పలే కన్నమ్మ, గుచ్చిమి గ్రామానికి చెందిన టీల నారాయణమ్మ, ఉత్తరావల్లి నాగలక్ష్మికి డయేరియా లక్షణాలు కనిపించాయి. దీంతో వారిని గజపతినగరం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని దత్తిరాజేరు వైద్యాధికారి ఆర్.ఆనంద్‌కుమార్ తెలిపారు.

కెంగువలో మరో రెండు కేసులు

గజపతినగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కెంగువ గ్రామంలో మంగళవారం రెండు డయేరియా కేసులు నమోదైనట్లు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సాయి కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం 4 కేసులు నమోదు కాగా కొత్తగా గ్రామంలో మారేడుపల్లి రామారావు, పెనుమజ్జి గాయిత్రికి డయేరియా లక్షణాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆర్డీవో రామ్మోహనరావు గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు.

రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపిక

పూసపాటిరేగ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): ఈనెల 18వ తేదీన విజయనగరం రాజీవ్ స్టేడియంలో జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్‌కు మండలంలో గల ఆర్డర్ పాఠశాలకు చెందిన పతివాడ జోగేశ్వరరావు అనే 9వతరగతి విద్యార్థి హ్యాండ్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 24న రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నాడు. పాఠశాల అకడమిక్ డైరెక్టర్ వి.వి.రమణ, ప్రిన్సిపాల్ మహంతి శ్యామలరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

● గుర్ల, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీల్లో భాగంగా శనివారం విజయనగరం విజ్జి స్టేడియంలో త్రోబాల్ సెలక్షన్స్, సోమవారం డెంకాడ మండల జెడ్పీహెచ్ఎస్ రఘుమండలో కబడ్డీ సెలక్షన్స్ జరిగాయి. ఈ సెలక్షన్స్‌లో జెడ్పీహెచ్ఎస్ వల్లాపురం విద్యార్థులు త్రోబాల్ క్రీడలో 5 మంది, కబడ్డీ క్రీడలో ముగ్గురు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.తిరుపతిరావు తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వి.అప్పారావు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈవో

వేపాడ, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బానాది, బల్లంకి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి-2 బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా బానాది మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 1,2 తరగతుల విద్యార్థుల పుస్తకాలను పరిశీలించారు. పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజనాలను తనిఖీచేశారు. బల్లంకి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల తరగతి గదులు, పరిసరాలను పరిశీలించారు.

రీసర్వే భూసమస్యల పరిష్కార సభ

బొబ్బిలి రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మవలస గ్రామంలో మంగళవారం రీసర్వే సంబంధించి భూసమస్యల పరిష్కార సభ సర్పంచ్ పిల్లా వసుంధర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికై ఈ గ్రామసభ నిర్వహించామన్నారు. రీసర్వే సంబంధించి వివిధ సమస్యలపై రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు.

చి'వరి'లో కష్టాలు


శ్రమదానం చేస్తున్న రైతులు

(ఐదో పేజీ తరువాయి)

వైసీపీ ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేసింది. కేవలం ఎడమ ప్రధాన కాలువ పరిధిలో 17 కిలోమీటర్లు, కుడి ప్రధాన కాలువ పరిధిలో 9 కిలోమీటర్ల మేర మాత్రమే లైనింగ్ పనులు పూర్తి చేసింది. బ్రాంచి కాలువలకు షట్టర్లను ఏర్పాటు చేయలేదు. కుడి, ఎడమ కాలువ పరిధిలో 33 మంది లస్కర్లకు గాను కేవలం 8 మంది మాత్రమే ఉన్నారు. దీంతో సాగునీటిపై పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉంటుంది. ప్రస్తుతం జిల్లాతో పాటు ఒడిశాలోని క్యాచ్‌మెంట్ ఏరియాలో కూడా నెల రోజులుగా వర్షాలు కురవడం లేదు. పైగా వేసవిని తలపించేలా ఎండలు దంచి కొడుతున్నాయి. ఫలితంగా సాగునీటి సమస్య జటిలమవుతోంది. ప్రస్తుతం తోటపల్లి ప్రాజెక్టులో 102 మీటర్ల నీరు మాత్రమే ఉండ డంతో కాలువల ద్వారా పూర్తిస్థాయిలో సాగునీరు అందని పరిస్థితి నెలకొంది.

శ్రమదానం చేసినా ప్రయోజనం శూన్యం

తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ పరిధిలో ఉన్న 7, 8 బ్రాంచిలకు చెందిన శివారు ప్రాంత రైతాంగం చివరి దశలో ఉన్న పంటలను రక్షించుకొనేందుకు గ్రామాల వారీగా శ్రమదానం చేస్తున్నారు. కాలువలో ని పిచ్చి మొక్కలు తొలగిస్తున్నారు. అలాగే కాలువ పైభాగంలో ఉన్న రైతులు వేస్తున్న పూనెలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే సాగునీరు ఫ్లో తక్కువగా ఉండడంతో శివారు ప్రాంతానికి రావడం లేదు. దీంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రాజెక్టులో 104 మీటర్ల మేర నీరు అందుబాటులో ఉంటే కాలువల ద్వారా పుష్కలంగా నీరు అందే అవకాశం ఉంది.

400 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నాం

తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ ద్వారా ప్రస్తుతం 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. ప్రాజెక్టులో నీటి నిల్వ తక్కువగా ఉంది. దీంతో కాలువల ద్వారా సాగునీటి ప్రవాహం తగ్గింది. 7, 8 బ్రాంచిలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నాం. - రంగనాయకులు, ఇన్‌చార్జి, డీఈ

రూ.1,200కోట్లతో గిరిజన గ్రామాలకు రహదారులు

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.1,200కోట్లతో రెండు వేల గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రహదారులు నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిధులు మంజూరు చేశారని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పారు. మంగళవారం ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీలో ట్రైబుల్ వెల్ఫేర్ వర్క్‌షాప్‌లో గిరిజన ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యలపై వివరించినట్టు తెలిపారు. ఆశ్రమ పాఠశాల పిల్లల ఆరోగ్య పరిరక్షణ కోసం ఏఎన్ఎంలను ఏర్పాటు చేస్తామన్నారు. ఐటీడీఏలో పాలకవర్గ సమావేశాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

ఆసుపత్రి నిర్మాణం పూర్తి చేయాలి


ఆసుపత్రి నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో చేపడుతున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి భవన నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. జిల్లాలోని ప్రజలకు ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే మెరుగైన వైద్య సదుపాయాలు అందుతాయని, వేరే జిల్లాలకు రిఫర్ చేయాల్సి అవసరం ఉండదని అన్నారు.

సమస్య రాకుండా ముందే స్పందించాలి: ఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

సాలూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సమస్య వచ్చిన తర్వాత కాకుండా, ముందే సమాచార సేకరణ చేసి, స్పందించాలని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. సాలూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. కేసుల పరిష్కారంపై రూరల్ ఎస్ఐ పి.నరసింహమూర్తిని ప్రశ్నించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పార్వతీపురం ఎస్డీపీవో అంకిత్ మహావీర్ సురాన, సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ● మక్కువ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ మాధవరెడ్డి మంగళవారం సందర్శించారు. స్టేషన్, సీఆర్‌పీఎఫ్ క్యాంప్ ఆఫీస్‌లను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఏఎస్పీ అంకిత సురానా, సీఐ రామకృష్ణ, ఎస్ఐ వెంకటరమణమూర్తి పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం కారణంగా మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు లేకుండా రక్షిత పథకాల్లో నీరు నిల్వ చేశామని ఆర్‌డబ్ల్యూఎస్ మండల జేఈ గోపి గౌరీశంకరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. ముందుగా ఆయా గ్రామాల్లోని రక్షిత తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ చేయించామని చెప్పారు. ● వీరఘట్టం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ తాగునీటి పరీక్షలు చేయాలని ఎంపీడీవో వెంకటరమణ ఆదేశించారు. మంగళవా రం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తుఫాన్ నేపథ్యం లో పంచాయతీలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

ఉద్యాన పంటలతో రైతుకు మేలు

సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపురం, పెదభోగిలి గ్రామాల్లో ఏవో ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రస్తాకుంటుబాయి కేవీకే శాస్త్రవేత్తలు శ్రీనివాస్‌రాజు, అమృతవీణ, ఉమాజ్యోతి పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రాజు మాట్లాడుతూ ఉద్యాన పంటలు పండించే రైతులకు కృషి విజ్ఞాన కేంద్రంలో అధిక ఆదాయం వచ్చేలా శిక్షణ కార్యక్రమాలు ఇస్తామని తెలిపారు.


కిమ్మి గ్రామంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

సొంత భవనాలు లేక.. ఇబ్బందులు తప్పక

- అర్ధాంతరంగా నిలిచిన అంగన్‌వాడీ కేంద్రాలు
- మంజూరు కాని నిధులు

వీరఘట్టం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 77 అంగన్‌వాడీ కేంద్రాలు, 14 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో మొత్తం నాలుగు సెక్టార్లు ఉండగా ఇద్దరు సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా అంగన్‌వాడీ భవనాలకు నిధులు మంజూరు చేయకపోవడంతో కొత్త భవనాల నిర్మాణం చేపట్టలేదు. అంతకుముందు టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన భవనాలు నిర్మాణం మధ్యలో నిలిచిపోయాయి. కిమ్మి గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అంగన్‌వాడీ భవనాలపై ప్రభుత్వం దృష్టిసారించింది. ఇటీవల కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో వెంకటరమణ అంగన్‌వాడీ భవనాల వివరాలు సేకరించారు. అంగన్‌వాడీ సెంటర్ల వద్ద మరుగుదొడ్లు నిర్మాణం కూడా చేపట్టడానికి ప్రణాళికలు తయారు చేస్తున్నారు. దీంతో ప్రజలు కొత్త భవనాలు, మధ్యలో నిలిచిన భవనాల పనులు పూర్తవుతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొండెంఖల్‌లో ప్రజాదర్బార్


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం రూరల్, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మొండెంఖల్ కేంద్రంగా కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మొండెంఖల్‌కు సమీపంలో గల ఆరు పంచాయతీలకు చెందిన ప్రజలు పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. మొత్తం 680 అర్జీలు రాగా, ఎక్కువగా పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలంటూ అభ్యర్థించారు. ఈ అర్జీలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కలిశెట్టి కొండయ్య, పార్టీ అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుపై దృష్టి

జియ్యమ్మవలస, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులంతా సభ్యత్వ నమోదుపై పూర్తి దృష్టి సారించాలని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. మంగళవారం చినమేరంగి గ్రామంలో మాజీ మంత్రి విజయరామ రాజు నివాసంలో టీడీపీ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 10 నాటికి సభ్యత్వ నమోదు పూర్తి కావాలన్నారు. అనంతరం నీటి సంఘాల ఎన్నికలు ప్రకటన త్వరలో రానున్న నేపథ్యంలో ముఖ్య నాయకులందరూ ఆయకట్టు రైతులందరూ ఓటర్ల జాబితాలో చేరేటట్లు చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు, అరకు పార్లమెంటు నియోజకవర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- స్వచ్ఛ సుందర పార్వతీపురం, అంగన్‌వాడీల సుందరీకరణపై సమీక్ష

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణాన్ని స్వచ్ఛ సుందర పార్వతీపురంగా తీర్చిదిద్దడంలో సరికొత్త ఆలోచనలతో ముందుకు రావాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రభుత్వ పాఠశాలల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురం, అంగన్‌వాడీల సుందరీకరణపై ఆయా శాఖల అధికారులతో ఆయన మాట్లాడారు. తడిచెత్తను, పొడిచెత్తను వేరుచేసి చెత్త నుంచి సంపద సృష్టించడం, పిల్లల కోసం సుందరమైన పార్క్‌లు, ముఖ్యకూడళ్లలో స్క్రాప్ ఆర్ట్స్, బర్రెల గ్రౌండ్ వంటివి ఏర్పాటు చేసేందుకు సంకల్పించినట్టు చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్, బస్టాండ్, రైల్వేస్టేషన్, జనసంచారం ఉన్న ప్రదేశాలను గుర్తించి స్వచ్ఛ సుందర పార్వతీపురం లోగోలను, సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ గోడలపై నవర ఆర్ట్‌తో కూడిన చిత్రాలను, ప్రజలను చైతన్యపరిచే చిత్రాలను వేయించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దాలి

జిల్లాలో 516 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వాటికి మంచి రంగులు వేసి అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పెయింటింగ్స్ వేయించి ఉన్నవాటిని మినహాయించి మిగిలిన కేంద్రాలకు లోపల, వెలుపల నిర్దేశించిన రంగులను వేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారి ఎంఎన్ రాణి, డీఈవో జి.పగడాలమ్మ, ఇతర జిల్లా అధికారులు, ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ఉపాధ్యాయులు, సీడీపీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

వృద్ధులను ఇబ్బంది పెడితే శిక్ష తప్పదు

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వయో వృద్ధులను, తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసి, నిరాధరణకు గురిచేస్తే శిక్షార్హులవుతారని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ రూపొందించిన అవగాహన పోస్టర్‌ను ఆయన మంగళవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో విడుదల చేశారు. 60 ఏళ్లు దాటిన తల్లిదండ్రులు, వయోవృద్ధులకు సంరక్షణ, భద్రత కల్పించాల్సిన బాధ్యత వారి కుమారుడు, కుమార్తెలదేనని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల నుంచి పోషణ ఖర్చులు కోరే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందన్నారు. వృద్ధుల సమస్యలకు సంబంధించిన కేసుల్లో పరిష్కారానికి జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆర్డీవో ఆధ్వర్యంలో ట్రిబ్యునల్‌ను ప్రభుత్వం నియమించిందని వివరించారు. ఆహారం, దుస్తులు, ఆశ్రయం, వైద్య ఖర్చుల నిమిత్తం నెలకు రూ.పది వేలు తల్లిదండ్రులకు పిల్లలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆస్తి రాయించుకుని తల్లిదండ్రులకు పోషణ, సంరక్షణ చూడకపోతే తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టం- 2007 ప్రకారం కేసులు నమోదు చేసి శిక్షలు విధిస్తామని ఆయన హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా తల్లిదండ్రులు, వయోవృద్ధులు, వారి పిల్లలు, బంధువులు వల్ల ఇబ్బందులు పడుతున్న వారు ఆర్డీవోకి రాత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చునని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో జి.కేశవనాయుడు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, జిల్లా విద్యా శాఖాధికారి జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

'అక్షయపాత్ర' ఆహారం వద్దు

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో, కళాశాల వసతి గృహాల్లో భోజనాలు ఇకపై అక్షయపాత్ర సంస్థ ద్వారా సరఫరా చేసి విద్యార్థులకు అందించాలనే ముఖ్యమంత్రి ఆలోచనను ఉపసంహరించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేద, గిరిజన విద్యార్థులకు నష్టం చేసే ఆలోచన చేయడం ఏమాత్రం సరైందని కాదన్నారు.

12వ పీఆర్సీ కమిటీని నియమించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించి 12వ పీఆర్సీ కమిటీని త్వరితగతిన నియమించాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రతినిధి పూడి వెంకటనాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జీవో నెంబరు 117ను రద్దు చేయాలన్నారు. అనంతరం యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు నిర్వహించారు. అలాగే యూటీఎఫ్ మండల శాఖకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.రవీంద్రనాథ్, అధ్యక్షుడిగా పూడి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తంగుడు శ్రీనివాసరావు, సహాధ్యక్షులుగా ఎం.మన్మథరావు, ఎ.జయలక్ష్మి, కోశాధికారిగా కె.ధర్మారావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా జె.సురేష్, సీపీఎస్ కన్వీనర్‌గా బి.ఎరుకునాయుడును ఎన్నుకున్నారు. పరిశీలకుడిగా శ్రీనివాసరావు వ్యవహరించారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

బలిజిపేట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద బాధితుల కోసం టీడీపీ మండల నాయకుడు పెంకి వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో రూ.3లక్షల 68వేలను సేకరించారు. ఈ చెక్కును ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆయన మంగళవారం అందించారు. టీడీపీ నాయకులు పెంకి రామ్మోహన్‌నాయుడు, అలమండ రమణ, డి.భాస్కరరావు, జి.సింహాచలంనాయుడు, కె.సింహాచలంనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి బాబ్జీ, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● సీతానగరం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటసీతారాంపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వరద బాధితులకు రూ.15 వేలు అందజేశారు. ఈ మొత్తాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు మంగళవారం అందజేశారు.

ఎంఎస్‌పీ కంపెనీకి ఆటంకాలు కల్పించొద్దు

బెలగాం, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): కోరి గ్రామంలో సర్వే నెం.1లో ఉన్న కొండను ఎంఎస్‌పీ కంపెనీకి గ్రానైట్ లీజ్ ఇవ్వడంతో తమకు ఉపాధి లభిస్తుందని, ఆ కంపెనీకి ఆటంకాలు కల్పించొద్దని పార్వతీపురం మండలానికి చెందిన వెలగవలస, కోరి, గంగాపురం, తొక్కునవలస తదితర గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు కలెక్టరేట్ వద్ద నినాదాలు చేసి, వినతిపత్రం అందజేశారు.

సీతంపేట పంచాయతీ కార్యదర్శిగా రామకృష్ణ

సీతంపేట రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సీతంపేట పంచాయతీ కార్యదర్శిగా బైరెడ్డి రామకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు. బూర్జ మండలం డొంకలపర్త సెక్రటరీగా పనిచేసిన రామకృష్ణ ఇటీవల జరిగిన బదిలీల్లో సీతంపేట పంచాయతీ గ్రేడ్-3 సెక్రటరీగా బదిలీపై ఇక్కడకు వచ్చారు. సీతంపేట పంచాయతీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.

ట్రైసైకిళ్ల పంపిణీ

పార్వతీపురం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆయన కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. వినికిడి లోపం ఉన్న యువకునికి వినికిడి పరికరాన్ని అందించారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకురాలు కె.కవిత పాల్గొన్నారు.

తుఫాన్‌పై అప్రమత్తం

పాచిపెంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి ఎంపీడీవో బీవీజే పాత్రో తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ సచివాలయ సెక్రటరీలకు అత్యవసర సమావేశం నిర్వహించారు. తుఫాన్ సమయంలో అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందివ్వాలని అన్నారు. తహసీల్దార్ డి.రవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పింఛన్లపై విచారణ నిర్వహించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీవీ పురం, ఉద్దవోలు పంచాయతీల్లో పింఛన్లపై పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించాలని ప్రజాప్రతినిధులు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్ బొత్స లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు చింతల మల్లినాయుడు, మరడాన సత్యనారా యణ, బాణాల సురేష్ మాట్లాడారు. అనర్హులకు పింఛన్లు నిలుపుదల చేయాలని పలు దఫాలు ఎంపీడీవో జి.పైడితల్లికి తెలియపర్చినా స్పందించలేదన్నారు. అనర్హులను తొలగించకుంటే కోర్టును ఆశ్రయిస్తామన్నారు. ● వీరఘట్టం, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): వండువ గ్రామంలో అనర్హులకు పింఛన్లు అందుతున్నాయని, వారిని గుర్తించి తొలగించాలని కొంతమంది ఎంపీడీవో వెంకటరమణకు మంగళవారం వినతిపత్రం అందించారు. విచారణ నిర్వహించి పింఛన్లు తొలగిస్తామని ఎంపీడీవో తెలిపారు.

నేటి నుంచి అంతర్ కళాశాలల క్రీడా పోటీలు

పాలకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 23, 24, 25 తేదీల్లో అంతర్ కళాశాలల క్రీడా పోటీలు, ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంబాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎచ్చెర్ల బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సౌజన్యంతో వాలీబాల్, రన్నింగ్, కబడ్డీలో పోటీలకు ఎంపిక ప్రక్రియ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జయకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. ఈ టోర్నమెంట్‌లో అంబేడ్కర్ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుంచి వాలీబాల్ పురుషులు 17 టీంలు, వాలీబాల్ మహిళలు నాలుగు టీంలు, కబడ్డీ పురుషుల నుంచి 11 టీంలు, మహిళల కబడ్డీ నుంచి ఆరు టీంలు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9550406959 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ప్రాంతీయ సదస్సుకు రైతు నాయకులు


అనకాపల్లి బయలుదేరి వెళుతున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): బాబూ జగజ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతికి కావాల్సిన నిధులు ఇవ్వాలని కోరుతూ అనకాపల్లిలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాంతీయ సదస్సుకు స్థానిక రైతులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు ఆధ్వర్యంలో తరలివెళ్లారు. తోటపల్లి కాలువ ఆధునికీకరణ పనుల సాధన సమితి అధ్యక్షుడు చేబోదుల లక్ష్మీనారాయణ, విశ్రాంత ఉద్యోగ సంఘాల జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన పాక చౌదరినాయుడు జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

సాలూరు రూరల్, అక్టోబరు 22(ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణం, రూరల్‌లో మద్యం షాపులు, బార్లను ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ సిబ్బంది ఎస్ఐ బాబూరావు ఆధ్వర్యంలో మంగళవారం పరిశీలించారు. స్టాక్‌ను తనిఖీ చేశారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలుంటాయన్నారు. మామిడిపల్లిలో మద్యం షాపు వద్ద ఉన్న పరిస్థితులు పరిశీలించి, ఆగ్రహం వ్యక్తం చేశారు. షాపును చక్కదిద్దాలన్నారు.

సచివాలయ ఉద్యోగికి మెమో

సాలూరు, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండో వార్డు సచివాలయంలో టౌన్ ప్లానింగ్ సెక్రటరీగా పని చేస్తున్న రెడ్డి మహేష్‌కు మెమో జారీ చేస్తున్నట్టు కమిషనర్ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. రెండో వార్డు సచివాలయానికి తాను ఆకస్మిక తనిఖీ నిర్వహించగా మహేష్ విధుల్లో లేకపోవటంతో పాటు ఫోన్ చేసినా సమాధానం చెప్పకపోవటంతో మెమో ఇస్తున్నట్టు ఆయన చెప్పారు.

బ్రిడ్జి కింద బండరాళ్లను తొలగించండి

పాచిపెంట, అక్టోబరు 22 (ఆంధ్రజ్యోతి): పెద్దగెడ్డ జలాశయం స్పిల్‌వే ఎదురుగా ఉన్న బ్రిడ్జి కింద పేరుకుపోయిన బండరాళ్లను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కోరాడ ఈశ్వరరావు కోరారు. వర్షాల కారణంగా బండరాళ్లు కొట్టుకువచ్చి బ్రిడ్జి కింద పేరుకుపోయాయని చెప్పారు. దీనివల్ల బ్రిడ్జికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. బ్రిడ్జికి ముప్పు వాటిల్లితే మండలవాసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బ్రిడ్జి కింద పేరుకుపోయిన బండరాళ్ల తొలగింపునకు చర్యలు చేపట్టాలని కోరారు.